# గోరక్షణ పేరిట హంతక ముఠాలు

**గోరక్షణ** పేరిట నేరస్త దాడులు నానాటికీ పెరిగి పోతున్నాయి. 2012లో మొదటి దాడి జరిగింది. 2013లో మరో దాడి జరిగింది. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 2014లో మూడు దాడులు జరిగాయి. 2015 ఇవి 13కు పెరిగి, 2016లో రెట్టింపు అయ్యాయి. 2017లో ఇప్పటికి 35 దాడులు జరిగాయి. మొత్తం 78 దాడులలో 35 ఈ ఏడాదే జరిగాయి. ఈ దాడులపై ప్రజలెంత నిరసన వ్యక్తంచేసినా యీ హంతక ముఠాల ఆగడాలు తగ్గకపోవటానికి అధికారంలో వున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల మద్దతు వీరికుండటమేనన్నది స్పష్టం.

ఈ ఏడాదిలో మొదటి కేసు ఏప్రిల్ నెలలో నమోదయింది. హర్యానాకు చెందిన 55 ఏళ్ల పాడిరైతు పెహ్లుఖాన్‌ను గోవధ చేస్తున్నాడంటూ రాజస్తాన్‌లోని, ఆల్వార్ జిల్లాలో చావబాదారు. రెండురోజుల తర్వాత ఆస్పత్రిలో ఆయన ప్రాణాలు విడిచాడు. మరణించే ముందు తనపై దాడిచేసిన ఆరుగురి పేర్లను ఆయన పోలీసులకు చెప్పాడు. వారు : ఓం యాదవ్, హుకుం చంద్‌యాదవ్, సుధీర్‌యాదవ్, జగ్మల్‌యాదవ్, నవీన్‌శర్మ, రాహుల్ సైనీ. వీరిపై ఆల్వార్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. రాసి కేసు నమోదు చేశారు.

ఐదునెలల తర్వాత సెప్టెంబరు 1న క్రైమ్ బ్రాంచి తన పరిశోధనా నివేదికను అందజేసింది. ఈ ఆరుగురు ముద్దాయిలు నేరంలో పాల్గొనలేదని తేల్చింది. నేరం జరిగిన స్థలానికి 4 కి.మీ దూరంలో ఒక గోశాల వుంది. ఆ గోశాల సిబ్బంది నేరం జరిగిన సమయంలో ఆరుగురు వ్యక్తులు గోశాలలో వున్నారని చెప్పారట. అందుకని వారికీ నేరంలో సంబంధం లేదని తేల్చింది. నేరస్తుల్లో ఒకడయిన జగ్మల్‌యాదవ్ ఈ గోశాల పోషకుడు. బాధితుడి మరణ వాఙ్మూలంకంటే, ముద్దాయి పనిలో పెట్టుకున్న కూలీలు చెప్పిన మాటలను విలువైనదిగా పరిగణించి ఈ ఆరుగురినీ కేసునుండి విముక్తి చేశారు.

2017 ఏప్రిల్‌లో, పెహ్లుఖాన్ హత్య తర్వాత కొన్ని రోజులకు "గోరక్షణ" దళాల చర్యలకు మీరెలా స్పందిస్తున్నారో తెలుపమని సుప్రింకోర్టు కేంద్ర ప్రభుత్వానికీ, ఐదు బిజెపి పాలిత రాష్ట్రాలకూ (రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్) కాంగ్రెసు పాలిత కర్ణాటక ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ దాడులను నిరోధించే చర్యలను వెంటనే తీసుకొమ్మని ఆదేశించింది. పెహ్లుఖాన్‌ను చంపిన వారిపై రాజస్తాన్ ప్రభుత్వం తీసుకున్న చర్య, వారిని విచారణకు కూడా రాకుండా నిర్దోషులని విడిచిపెట్టడమే.

వడ్డించేది మన వాడైతే బంతిలో చివరకూర్చున్నా ఫర్యాలేదన్నట్లు, అధికారంలో వున్న వారి ఆశీర్వాదా లున్నప్పుడు ఎన్ని నేరాలైనా చేయవచ్చు! ఇక గోరక్షణ పేరిట హంతక దాడులు పెరిగిపోతున్నాయంటే ఆశ్చర్య పోవలసిందేమీలేదు. మతపరంగా సమాజాన్ని చీల్చ బూనుకున్న వారికి చట్టమంటే భయమేమీ వుండదు.

ooooo